ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 15.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పంటలు ఎండిపోకుండా రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

2. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించడానికి విదేశాల నుంచి భారీగా నిధులు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు.

3. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే కుట్రలను BRS పార్టీ బలంగా తిప్పికొడుతుందని వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు హెచ్చరించారు.

4. తెలంగాణ సంస్కృతి , సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

**రేవంత్ రెడ్డి**

తెలంగాణలో ప్రభుత్వ విధానాలు స్థిరంగా ఉంటాయని , పెట్టుబడులకు పూర్తి భద్రత ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రిటన్ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందానికి భరోసా ఇచ్చారు. తయారీ రంగ విస్తరణతో పాటు యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. రాష్ట్రం లో వాణిజ్యం, విద్య, పరిశోధన, సాంకేతిక రంగాలలో భాగస్వామ్యానికి బ్రిటన్ ప్రతినిధులు తీవ్ర ఆసక్తిని వ్యక్తం చేశారు.

డెస్క్

**ముఖ్యమంత్రి**

పంటలు ఎండిపోకుండా రైతులకు రేయింబవళ్లు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం , విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే ఇరవై రోజులు అత్యంత కీలకమని , విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని కోవిడ్ లాంటి విపత్తుగా భావించి జూన్ వరకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు.

డెస్క్

**మిప్‌కామ్ కాన్స్ 2026**

ఫ్రాన్స్ లో జరిగిన మిప్‌కామ్ కాన్స్ 2026 వేదికగా తెలంగాణ బృందం గ్లోబల్ మీడియా , ఎంటర్‌టైన్ మెంట్ దిగ్గజాలతో చర్చలు జరిపింది. సీఈఓ అజిత్ రెడ్డి నేతృత్వంలోని బృందం రాష్ట్ర ఎవిజిసి విధానం, ఇమేజ్ టవర్స్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించింది. అలాగే డిసెంబర్ 7 నుంచి 13 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో 'ఇండియాజాయ్' 9వ ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించి, పెట్టుబడిదారులను ఆహ్వానించింది.

డెస్క్

**రామచందర్ రావు**

ప్రధాని మోడీని వ్యతిరేకించడానికి విదేశాల నుంచి భారీగా నిధులు అందుతున్నాయని బీజేపీ తెలంగాణ చీఫ్ రామచందర్ రావు ఆరోపించారు. ప్రముఖ గాయని మేరీ మిల్బెన్ ట్వీట్ ఆధారంగా, దేశంలో అల్లర్లు సృష్టించేందుకు ఆప్ అనుబంధ సంస్థలకు అమెరికా నుంచి నిధులు వస్తున్నాయని మండిపడ్డారు. జార్జ్ సోరోస్ లాంటి విదేశీ ఏజెన్సీలు దీని వెనుక ఉన్నాయని రాంచందర్ రావు ధ్వజమెత్తారు.

డెస్క్

**బండి సంజయ్**

కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా నిన్న అమ్మవారు మహాచండీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రేపు ఆలయంలో సరస్వతి పూజ , పల్లకీ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

డెస్క్

**హైదరాబాద్**

హైదరాబాద్‌లో అక్టోబర్ 17న జరగనున్న 78వ బ్యాచ్ ఐపీఎస్ ప్రొబేషనర్ల 'దీక్షాంత్ పరేడ్ ' వివరాలను అకాడమీ డైరెక్టర్ సుజీత్ పాండే వెల్లడించారు. మొత్తం 151 మందిలో 135 మంది ఐపీఎస్‌లు, 16 మంది విదేశీ అధికారులు శిక్షణ పూర్తిచేసుకోగా , అందులో 37 మంది మహిళలు ఉన్నారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ పరేడ్ ద్వారా ఆధునిక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేలా అధికారులను తీర్చిదిద్దినట్లు తెలిపారు.

పిటిసి, హైదరాబాద్

**హరీశ్ రావు**

విద్యుత్ సంక్షోభానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమ ర్థత కారణమని, అధికారులపై నెపం నెట్టడం సరికాదని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. బొగ్గు నిల్వలు , సమీక్షలు లేక కరెంట్ కోతలు విధించి అధికారులను సస్పెండ్ చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. అధికారుల ఉద్యోగాలపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ప్రజలు , ఉద్యోగులే ఇంటికి సాగనంపుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డెస్క్

**అబ్దుల్ కలాం జన్మదినం**

ఈరోజు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జన్మదినం సందర్భంగా , ఆయన సేవలను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు గుర్తు చేసుకున్నారు. దేశ రక్షణ వ్యవస్థ అభివృద్ధిలో ఆయన కీలక పాత్రను దేశం ఎప్పటికీ గుర్తు చేసుకుంటుందని పేర్కొన్నారు.

డెస్క్

**కేటీఆర్**

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే కుట్రలను తిప్పికొడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు హెచ్చరించారు. గోదావరిఖనిలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సభలో కేటీఆర్ మాట్లాడుతూ ... సింగరేణిలో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కార్మికులకు లాభాల వాటా ఇవ్వకుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు , మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

డెస్క్

**శ్రీధర్ బాబు**

సింగరేణిని ప్రైవేటుకరణ చేసే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఈ రోజు CLP కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణకి గుండె కాయ లాంటి సింగరేణిని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి న్ని పెంచడానికి ప్రణాళిక బద్ధం గా ముందుకు వేళ్తున్నట్లు పేర్కొన్నారు. BRS నాయకులు అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నార ని విమర్శించారు. BRS హయంలో సింగరేణి అప్పుల ఊబిలో కూరుకుపో యందని ఆరోపించారు. పలువురు శాసనసభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

**MSM RNU HYD**

**పొన్నం ప్రభాకర్**

క్రీడలు, వ్యాయామం తోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ విసిరిన 'ఖేలో తెలంగాణ బంధన్ ' ఫిట్‌నెస్ ఛాలెంజ్‌ను స్వీకరించి, రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు.

ప్రజల్లో అవగాహన కోసం మరో తొమ్మిది మంది ఉన్నతాధికారులకు ఆయన ఈ ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు. బీసీ విద్యా సంస్థల్లో కూడా క్రీడా సంస్కృతిని పెంపొందిస్తామని స్పష్టం చేశారు.

డెస్క్

**బతుకమ్మ వేడుకలు**

తెలంగాణ సంస్కృతి , సంప్రదాయాలకు ప్రతీకయైన బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో , మానేరు తీరంలో నిన్న రాత్రి ఐదవ రోజు అట్ల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొని, అక్టోబర్ 17 వరకు ప్రతిరోజూ బతుకమ్మ సంబురాలు ఉంటాయని తెలియజేశారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ హరిత, సిబ్బందితో కలిసి పూల జాతరలో పాల్గొన్నారు.

అలాగే హైదరాబాద్‌లోని బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, తెలంగాణ విశిష్ట సంస్కృతిని కొనియాడారు.

వరంగల్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, ఆసిఫాబాద్, డెస్క్

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు రిజర్వాయర్ ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సందర్శించారు. సింగూరు ప్రాజెక్టును , ప్రాజెక్టు నీటి నిల్వలు , పరిశీలించి తాగునీటి సరఫరా

ప్రణాళికలపై అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్చించారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల నేపథ్యంలో కనీస నీటి నిల్వలు చేరడంతో... రానున్న రోజుల్లో నీటి ఎద్దడి , వర్షాబావు పరిస్థితులను ఎదుర్కొనే విధంగా నీటి ప్రణాళికలపై చర్చించారు . ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ...

బైట్ .. సంజయ్ జాజు, ప్రధాన కార్యదర్శి

పిటిసి, సంగారెడ్డి

**లోక్ భవస్‌లో - బతుకమ్మ వేడుకలు**

హైదరాబాద్ లోక్ భవన్‌లో ఈరోజు బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా అధికారుల ఏర్పాట్లతో లోక్ భవన్ పండుగ శోభను సంతరించుకుంది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు ఈ సంబరాల్లో పాల్గొంటారు

డెస్క్

**సస్పెండ్**

నల్గొండ జిల్లా, దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణల నేపథ్యంలో చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అలాగే ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి , బొగ్గు సరఫరాను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా ప్రభుత్వం నియమించింది.

డెస్క్